# కామన్‌సెన్స్ లేని కాంగ్రెస్

- ఓటమి భయంతోనే ఈసీకి లేఖ
- అన్నదాతలపై 'హస్తం' అక్కసు
- ఎన్నికల కోసం తెచ్చిన పథకం కాదు
- ఎన్ని ఆటంకాలు సృష్టించినా 'రైతుబంధు' ఆగదు
- 11 విడుతలుగా రూ.72వేల కోట్లు అందించాం
- రైతులతో రాజకీయాలు కాంగ్రెస్‌కు అలవాటే
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులపై మంత్రి ఫైర్


జిల్లా కేందంగ్రలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కామన్ సెన్స్ లేని కాంగ్రెస్ నాయకులు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు రైతుబంధు పథకం పంపిణీ నిలిపివేయాలని లేఖ రాశారని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. అవసరమైతే ప్రజా అంశాల మీద పోరాటం చేయాలి కానీ అన్నదాతలకు మేలు చేసే పథకాన్ని ఆపాలని కాంగ్రెస్ ప్రయత్నించడం అత్యంత దుర్మార్గమని మంత్రి పేర్కొన్నారు. రైతుబంధు పథకాన్ని నిలిపివే యాలని ఈసీకి కాంగ్రెస్ లేఖ రాయడంపై మంత్రి శుక్రవారం తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మట్టిని, కష్టాన్ని నమ్ముకొని సేద్యం చేస్తున్న రైతన్నకు సీఎం కేసీఆర్ రైతుబంధు పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలు అంతర్జాతీయ స్థాయిలోనే ఎంతో ప్రాముఖ్యతగా నిలిచాయని యూఎన్‌వో అనే సంస్థ నిర్ధారించిందని స్పష్టం చేశారు. రైతులపై కాంగ్రెస్‌కు ఏనాడు ప్రేమ లేదని, ఇప్పుడు కూడా అన్నదాతలపై మరోసారి తమ అక్కసును వెల్లగక్కుతూ రైతుబం ధు పథకాన్ని నిలిపివేయాలని నిర్ణయించుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఎప్పుడు రాజకీయమే కావాలి తప్పా ప్రజల బాగోగులు ఏనాడు పట్టించుకో లేదన్నారు. దేశంలోనే ఏ నాయకుడికి రాని ఆలోచన సీఎం కేసీఆర్‌కు వచ్చిందని, రైతుల కష్టాలు గట్టెక్కించాలన్న లక్ష్యంతోనే రైతుబంధు, రైతుబీమా పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. ఏనాడు రాజకీయ కోణంలో ఈ పథకాలను చూడలేదని, ఎన్నికలు గతంలో కూడా వచ్చాయని, అయినా ఈ పథకం ఏడాదిలో రెండు దఫాలు వానకాలం, యాసంగిలో రైతుల బ్యాంకు ఖాతాల్లో సమయానుకూలంగా డబ్బులు వేసుకుంటూ వెళ్లామని మంత్రి చెప్పారు. ఈ పథకంలో ముందుగా 90శాతం ఉన్న సన్న, చిన్న కారు రైతులకే డబ్బులు వేస్తారన్నారు. కాంగ్రెస్ ఎన్ని ఫిర్యాదులు చేసినా రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పథకాలు ఆగవని మంత్రి సింగిరెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. వచ్చే యాసంగిలో రైతుబంధు పడుతుందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా ప్రభుత్వం చేసిందని మంత్రి చెప్పారు. ఇప్పటి వరకు 11 విడుతల్లో రూ.72,815 కోట్లు రైతుబంధు పథకం ద్వారా అన్నదాతలకు అందించామన్నారు. రైతుల బాగు ఏమాత్రం పట్టని కాంగ్రెస్ జూఠాకోరు మాటలతో రాజకీయం చేయాలని చూస్తున్నదన్నారు. హుజూరునగర్ ఉప ఎన్నికల కోసమే దళితబంధు పథకాన్ని తెచ్చారని గోల చేసిన కాంగ్రెస్‌కు క్రమంగా దళితబంధు అమలు జరుగుతున్న తీరు కనబడటం లేదా అని మంత్రి సింగిరెడ్డి ప్రశ్నించారు. 40 ఏండ్లపాటు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్సీ కార్పొరేషన్లు ఎంతమేర అభివృద్ధి చేశాయో ఒక్కసారి పరిశీలించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కొన్ని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన పథకాలను నేడు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నదన్నారు. ఎన్నికలొస్తే ధాన్యం కొనుగోళ్లను సహితం కాంగ్రెస్ నిలిపివేయాలని కోరుతుందని మంత్రి ఎద్దేవా చేశారు. పరిణతితో ఆలోచించాల్సిన కాంగ్రెస్ రైతుల జీవితాలతో ఆడుకుంటుందని మంత్రి విమర్శించారు. పక్క రాష్ట్రమైన కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఎంత ఘోస పెడుతున్నదో అక్కడి రైతులు ఇక్కడికి వచ్చి వెల్లడిస్తున్న ఘటనలను మంత్రి గుర్తు చేశారు. కేవలం అరకొరగా కర్ణాటకలో రైతులకు కరెంట్‌ను అందిస్తున్న కాంగ్రెస్ తెలంగాణలో అదే రైతులతో రాజకీయం చేయాలని చూస్తున్నదని, కాంగ్రెస్ వ్యవహారంపై తెలంగాణ రైతులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూరు ప్రమోద్‌రెడ్డి, గొర్రెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, ఎన్నికల శిక్షణ తరగతుల కన్వీనర్ మెంటెపల్లి పురుషోత్తం రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, నాయకులు నాగం తిరుపతి రెడ్డి, లక్ష్మారెడ్డి, నందిమళ్ల అశోక్, రమేశ్, శ్యాంకుమార్, పుట్టపాకల మహేశ్, జహంగీర్, విష్ణు యాదవ్, నరేశ్ పాల్గొన్నారు.

### మంత్రి సమక్షంలో చేరికలు

గోపాల్‌పేట, అక్టోబర్ 27 : మండలంలోని చెన్నూరు సర్పంచ్ జిల్లెల శేషిరెడ్డి (కాంగెస్), సింగిల్‌విండో డైరెక్టర్ నారాయణరావుతోపాటు కాంగ్రెస్‌కు చెందిన 25 మంది శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేసిన వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గడ్డం నాగరాజు, రాధాకృష్ణ, బాలరాజు, దామోదర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, మల్లేశ్ ఉన్నారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు అడ్డాకుల తిరుపతి యాదవ్, బీఆర్ఎస్ నాయకులు నాగం తిరుపతిరెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు మొగులాలు నాయకులు మంద కోటీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంబాబురావు, అమ్రూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండాలి

- కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్
- 32 పోలింగ్ కేంద్రాల పరిశీలన
- వసతుల కల్పనపై కలెక్టర్ సంతృప్తి
- విద్యార్థులతో పాఠశాలలో సమస్యలపై ఆరా..



పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్

వనపర్తి/ గోపాల్‌పేట, అక్టోబర్ 27 : నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు ఉండాలని అధికారులను కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. నియోజకవర్గంలోని వనపర్తి, గోపాల్‌పేట, రేవల్లి, ఏదుల మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం కలెక్టర్ సందర్శించి మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ర్యాంపులు, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం తదితర చేసిన ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. జిల్లాలో ఎక్కడైనా సౌకర్యాలు లేకుంటే తక్షణమే ఏర్పాట్లు చేసుకోవాలని తా సీలార్లను ఆదేశించారు. అలాగే పాఠశాలల్లోని విద్యార్థులతో కలెక్టర్ మా ట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. బుద్దారం చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న స్టాటిస్టికల్ సర్వేలియన్స్ బృందంతో మాట్లాడారు. నిర్వహిస్తున్న విధులపై ఆరా తీశారు. అంతకుముందు వనపర్తి పట్టణంలోని బాలికల పాఠశాల, హరిజనవాడలోని ఉన్నత పాఠశాల, తాడిపర్తిలో ప్రాథమి కోన్నత పాఠశాల, గోపాల్‌పేటలోని జెడ్పీ హైస్కూల్, బుద్ధారంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల, పొల్కెపహాడ్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, తల్పునూర్‌లోని జెడ్పీ హైస్కూల్, రేవల్లిలోని జెడ్పీ హైస్కూల్, ఏదులలో ప్రాథమిక, జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలోని వసతులను పరిశీలించారు. కలెక్టర్ వెం ట వనపర్తి తాసీల్దార్ యాదగిరి, గోపాల్‌పేట తాసీల్దార్ శ్రీనివాసులు, రేవల్లి తాసీల్దార్ లక్ష్మీదేవి, ఎంఈఓలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న హైకోర్టు న్యాయవాది పద్మ

# పదేండ్లలో తెలంగాణ పచ్చబడింది

- అభివృద్ధిని చూసే మంత్రి వెంట నడవాలని గులాబీ పార్టీలోకి వచ్చా..
- నాగం తిరుపతిరెడ్డి
- హైకోర్టు న్యాయవాది పద్మ బీఆర్ఎస్‌లో చేరిక


విలేరకుల సమావేశంలో మాట్లాడుతున్న నాగం తిరుపతి రెడ్డి

వనపర్తి,అక్టోబర్ 27 : 20ఏండ్ల నా రాజకీయ జీవితంలో కాంగ్రెస్ నాయకులు ఇంత దిగజారుడు తనానికి దిగుతారని ఊహించలేదని నాగం తిరుపతి రెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని మంత్రి నిరంజన్‌రెడ్డి నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌లో టికెట్లు వ్యక్తి ప్రజాబలం చూసి ఇవ్వడం లేదని, డబ్బు బలం చూసి టికెట్లు అమ్ముకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీని భ్రష్టుపట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో సీనియర్లను విస్మరిస్తూ.. కొత్తగా పార్టీలోకి చేరిన వారికి టికెట్ ఇస్తూ అన్యాయం చేస్తున్నారన్నారు. 100ఏండ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు సీఎం అభ్యర్థి ఎవరని చెప్పలేని పరిస్థితికి వచ్చిందన్నారు. నేను గతంలో ఆంధ్రా ప్రాంతంలో కాంట్రాక్టర్‌గా చేస్తున్న సమయంలో ఎక్కడ చూసినా నీళ్లు, పంటలు కనిపించేవి, ఇలాంటి వాతావరణం నా ప్రాంతంలో కూడా ఉంటే బాగుండేదని అనుకునే వాడినని అన్నారు. అలాంటిది ఈ పదేండ్లలో తెలంగాణ వచ్చాక నిరంజన్‌రెడ్డి సారథ్యంలో నియోజకవర్గం ఇంత పచ్చని పందిళ్లుగా మారు తుందని ఊహించలేదన్నారు. ఎక్కడ చూసినా సాగునీళ్లతో నాడు బీడు పడిన భూములన్నీ పచ్చని పైర్లుగా మారిపోయాయన్నారు. వీటన్నింటి చూశాక నిరంజన్‌రెడ్డి వెంట ఉండి ఈ ఎన్నికల్లో అన్న గెలిపించుకొవాలన్న పట్టుదల సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు.

### పలువురు ప్రముఖులు బీఆర్ఎస్ పార్టీలో చేరిక...

మంత్రి స్వగృహంలో శుక్రవారం పలువురు ప్రముఖులు మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ కండువాలు కప్పుకున్నారు. వారిలో హైకోర్టు న్యాయవాది పద్మ మంత్రి నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. అలాగే గోపాల్‌పేట మండలంలోని చెన్నూర్ కాంగ్రెస్ సర్పంచ్ శేషిరెడ్డితోపాటు 20మంది బీఆర్ఎస్‌లో చేరారు. పలు గ్రామాలకు చెందిన పలు పార్టీలకు చెందిన 50యువత మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ కండువాలు కప్పుకున్నారు.

# భద్రత, భరోసా మాది

- స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలి
- ఎస్పీ రక్షితా మూర్తి
- జిల్లా కేంద్రంలో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్

వనపర్తి టౌన్, అక్టోబర్ 27: భద్రత, భరోసాను కల్పించే బాధ్యత తమదని, స్వేచ్ఛగా ఓటును ప్రజలు వినియోగించుకోవాలని ఎస్పీ రక్షితామూర్తి సూచించారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానం నుంచి కేంద్ర సాయుధ బలగాలతో శుక్రవారం ఫ్లాగ్ మార్చ్‌ను ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా పార్కు, శంకర్‌గంజ్, గాంధీచౌక్, వివేకానంద చౌరస్తా, మారెమ్మకుంట, అంబేద్కర్‌చౌక్, రాజీవ్‌చౌక్, బస్ డిపో ముందుగా ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో ఎలాంటి భయాందోళనలకు తావు లేకుండా చేయడంలో భాగంగా ఫ్లాగ్ మార్చ్‌తో ప్రజలందరికీ ఎన్నికలపై భద్రత, భరోసాను కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని మండలాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛ, పారదర్శకంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసులు, కేంద్ర బలగాలు విధులు నిర్వహిస్తారన్నారు. బందోబస్త్ మాత్రమే కాకుండా డబ్బు, మద్యం ఇతర విలువైన వస్తువులు అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టుల్లో బందోబస్త్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, కేంద్ర సాయుధ బలగాల కమాండర్ టి.రాబిన్, ప్రమోద్‌జీ, సీఐ మధుసూదన్, పరమేశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు అప్పలనాయుడు, శ్రీనివాస్, యుగంధర్‌రెడ్డి, జయన్న, జలందర్‌రెడ్డి, వినోద్, సురేందర్, కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.